# పీ ఠి క

## శ్రీ కురుగంటి సీతారామ భట్టాచార్యులు

దాదాపు పదిసంవత్సరముల క్రిందటి శ్రీ శివశంకర శాస్త్రిగారి యభ్యర్థనమునకు ప్రతిఫల మీపీఠిక. తమయేగ్రంథమునకు నెవరిని పీఠిక యడుగని శాస్త్రిగారు నా కీగౌరవ మిచ్చినందులకు కృతజ్ఞుడను. ఆంధ్రసాహిత్యలోకమున సుప్రసిద్ధు లగుశాస్త్రిగారు నన్ను పీఠికవ్రాయ మనుట నాకు మరియు గర్వకారణము. ఆధారగౌరవ మాధేయ మగునాకు గూడ గౌరవము కలిగించినందులకు సంతసించుచున్నాను.

చిన్నతనములో తమతండ్రిగారివలన విన్నయైతిహ్యామీనాటికకు కథావస్తు వని శాస్త్రిగారు నాతో జెప్పినారు. చిన్ననాడు విన్నవిషయము మనమున హత్తుకొని యీనాటికగా పరిణమించినది. పండితవంశమువా రగుటచే శాస్త్రిగా రిట్టియైతిహ్యము లనేకము విని వానిని కావ్యబద్ధములు చేసినారు. అనుస్యూతముగా వచ్చుచున్న యైతిహ్యసంస్కృతియందు వీరి కెంత గౌరవమో తెల్ల మగుచున్నది. ఇట్టియైతిహ్యజాలము జాతికి ధనము. దీనిని మరచుట జాతి పార్థక్యమును మరచుటయే!

శ్రీ శివశంకర శాస్త్రిగారిని నేను ఆంధ్రలోకమునకు పరిచితులను జేయనవసరము లేదు. వారి పాండితి, వారి సాహిత్యకృషి, వారిగ్రంథపరంపర ఆంధ్రదేశమున ముప్పదిసంవత్సరములకు పైగా వ్యాపించియున్నవి. వారు స్థాపించిన సాహితీ సమితియే ఆంధ్రసాహిత్యమున నవ్యసాహిత్యమునకు దోహద మొనర్చినది. వారియాశీర్వాద మెందరినో కవుల నొనర్చినది. వారు వ్యక్తియే కాదు—పెద్దసంస్థ.

# పీ ఠి క

శాస్త్రిగారు రచించినగ్రంధములు పెక్కులు. వారి హృదయేశ్వరి ఆంధ్రలోకమున మారుమ్రోగినది. గీతినాటికారచన వారిసొమ్ము. ఇతరు లెవరు రచించినను బాట వారిదే. సమకాలికులలో ననేకుల కవితాజ్యోతి చల్లారినది. శాస్త్రిగారిది నిరంతరకాంతిమంతమై వరలుచుండుట వారివిశిష్టత. పోను పోను కాంతి యధిక మగుటకూడ కానబడును.

“అపరితోషా ద్విదుషాం’ అను కాళిదాసోక్తి ననుసరించి శాస్త్రిగారు విద్వత్పరితోషకల్పనకై మహాకావ్యము రచింప యత్నించుచున్నారు. కావ్యము గీర్వాణవాణిలో నుండవలె ననునాయభిలాషను శాస్త్రిగారు సఫలము చేయుదు రని యాశించుచున్నాను.

శాస్త్రిగారికవిత్వప్రదానగుణములు ధారాప్రసన్నతలు. అందులోనెంత శిల్పమున్నదో యంతసహజముగ గనబడును; ఎంత ప్రసన్నముగ నుండునో యంత చర్వణయోగ్యము. వారిపాండిత్య మడుగడుగునను వ్యక్తమగుచుండును; దానిసర్వతోముఖతకూడ ద్యోతక మగుచుండును. రచనలో యతిప్రాసలు తమంత దా వచ్చి నిలుచును. గ్రంథము చదువనారంభించినచో తుదివరకు విడువ మన సొప్పదు. అన్వయకాఠిన్యముగాని మారుమూలపదముల ప్రయోగముగాని కనబడదు. ఎచ్చటనేని దీర్ఘసమాస మున్నను నయ్యది సులభగ్రాహ్యమై యౌచిత్యనిర్వాహణకుశలమై యుండును. ఉదాత్తము లైనశాస్త్ర సాహిత్య సూత్రములు కూడ పద్యపాదములలో నిమిడి కావ్యత్వము నొందును. నవ్య కవిత్వములో శ్రీశాస్త్రిగారిస్థాన మద్వితీయము.

పైలక్షణము లన్నియు “దీక్షిత దుహితలో” నున్నవి. ఏకాంకనాటిక నేటిసాహిత్యప్రక్రియలో నవ్యతమము, నవలకు కథానికవలె, మహాకావ్యమునకు ఖండకావ్యమువలె, నాటకమున కేకాంకిక లఘురూపము. కొలదిలో కథావస్తుమూల

మున రసనిర్వహణ మొనర్చుట కష్ట మైనపని. పాత్రబాహుళ్యము, ఇతర రసోపస్కారకత్వము, మొద లగువాని కేకాంకికలో స్థానము లేదు. కావున సూక్ష్మములో మోక్ష మనునట్లు, ఉన్నపాత్రలలో, పరిమితకథావస్తువుతో, ఇతరసహకార మెక్కువ లేకుండ రససిద్ధి కలిగించుట కెంతయో ప్రతిభ కావ లని యున్నది. అట్టిప్రతిభ శాస్త్రిగారికి కలదని ఈనాటిక తార్కాణించు చున్నది. ప్రవేశ పెట్టినపాత్రలను మిక్కిలి సమంజసముగా నిర్వహించి నారు శాస్త్రిగారు. ప్రతిసంభాషణవాక్యమందును, పాండిత్యవాతావరణము వెల్లి విరియుచున్నది. శాస్త్రమునకును ఆచారమునకును ఉండు బలాబలచర్చవలన బ్రాహ్మణ పండితకుటుంబములోని వారి మనస్తత్వము లెట్లుండునో విశదమగు చున్నవి. మరణము కానివిషాదాంతముగా దీనొనర్చి తమధర్మనిర్వహణ దీక్షను వెలిబుచ్చినారు శాస్త్రిగారు.

అప్పయ్య దీక్షితులు వడమశాఖకు చెందిన వారు. వడక్ అనగా ఉత్తరము. వడమ ఉత్తరమునుండి దక్షిణమునకు వెడలిన బ్రాహ్మణసమూహము. వీరిలో చాల కాలముక్రిందట వెడలినవారిని దక్షిణాదివడమ అనియు, తర్వాత వెడలినవారి నుత్తరాదివడమ అనియు నిర్వచించుచున్నారు. అప్పయ్య దీక్షితకుటుంబ మీ రెండవతెగకు చెందినది. ఈకుటుంబ మాంధ్రదేశమునుండి పోయి దక్షిణ ఆర్కాటుజిల్లాలోని అడియపాళె మనుగ్రామమున స్థావర మేర్పరచుకొనెను. వీరు ప్రథమమున ఆంధ్రు లని, అప్పయ్యదీక్షితుని దని చెప్పు ఈక్రింది శ్లోకమువలన తెలియ నగును :

"ఆంధ్రత్వ మాంధ్రభాషా చ ప్రాభాకరపరిశ్రమః

తత్రాపి యాజుషీశాఖా నాత్యల్పతపసః ఫలమ్"

ఇందలిలక్షణము లన్నియు అప్పయ్య దీక్షితునియం దున్నవి. అట్టియాంధ్రత్వమును శాస్త్రిగారు చక్కగా నిర్వహించినారు.

అప్పయ్య దీక్షితుని కాలమునుగూర్చి కొంతచర్చ కలదు. ఆయనజాతక మనునది నమ్ముటకు వీలు లేదని నా "తంజావూరుకవులు - పండితులు" అనుగ్రంథమున చర్చించియున్నాను. అడియపాశై దేవాలయశాసనకాలము శకాబ్దము 1504 = క్రీ. శ. 1582. ఈకథ తత్పూర్వ మగుటచే క్రీ. శ. 1580 సమంజసమే. "శివార్కమణిదీపిక" రచించినందులకు దీక్షితులకు చినబొమ్మభూపతివలన కనకాభిషేకము లభించెను. దీక్షితు లాద్రవ్యమును దేవాలయనిర్మాణమునకు వినియోగించెను. శివార్కమణిదీపికా ప్రశంసకూడ ఈనాటికలో సమంజసమే.

ఈనాటికకు చరిత్ర భిత్తికగా వర్తించుచున్నది. దీక్షితునకు ముగ్గురుకుమారులు. సుమంగలి యగుపుత్రిక, వితంతు వగుపుత్రికయు కల రని ప్రసిద్ధము. సరసురా లగుమరద లుండుట ఐతిహ్యప్రసిద్ధము. నాటికలో దీక్షితభవనారామాది వర్ణనము రాజపోష్యత్వమునకుద్దిష్టాంతము. నాటికలో సన్నివేశము లన్నియు వస్తువునకును పాత్రలచిత్తవృత్తులకును అనుగుణములు.

నాటికయందు రసము విప్రలంభశృంగారము. విభావాదులచే పోషణమునకు తావు లేకపోవుటవలన నాయికానాయకుల పరస్పరప్రేమప్రకటనతో నాటిక నారంభించుట చక్కగా నున్నది. ఆచారోల్లంఘన శంకాపీడితు డగుఅప్పయ్యతప్ప అందరును కథాగర్భమునకు తోడ్పడినారు. పునర్వివాహమునుగూర్చి చర్చ జరిగినది. ఆచారశాస్త్రసంఘర్షణ, దానిపై వివిధపాత్రలచిత్తవృత్తులును చక్కగా పొందుపరుపబడినవి. కవికి ఒకవైపున బాలవితంతువులయెడ సానుభూతియు, మరియొకవైపున అనూచానాచారప్రతిపత్తియు పొడచూపుచున్నవి.

కవిచిత్త వృత్తులే దీక్షితునియందు ప్రతిబింబించుచున్నవి. పాత్రలనామములు చరిత్రకు సరిపోవుచున్నవి. ప్రతిరంగమునందు సందలి యితివృత్తమున కను వగువరికరములు, సన్నివేశములును కల్పింపబడినవి. సందర్భము లన్నియు సుదాత్త భావోపేతములై యలరారుచున్నవి. స్వరమేళలను కల్పించి కవి దీక్షితులచిత్త క్షోభమును వ్యక్తము చేసినాడు. ఇయ్యది విచిత్రరచన.

అప్పయ్య దీక్షితులు పాత్రగా నున్ననాటికను శాస్త్రిగారు రచించుట సముచితము. కవి విద్వాంసు డగుటచే పండితప్రకాండుడును, శాస్త్రవేత్తయు నగుదీక్షితుని గృహములో జరిగినశాస్త్రచర్చలను ఔచిత్యముతో చిత్రింవగలిగినాడు. జ్యోతిషముప్రశంసకూడ కలదు. ఉద్ఘాటించిన శ్లోకజాతము ఆయాసన్నివేశములకు సరిపోయి వ్యంగ్యమర్యాదతో తత్తద్రసాభివ్యక్తి యం దుపకరించుచున్నది. శాస్త్రిగారు పండితు లయ్యును ప్రియులరసార్ద్రహృదయముల నెఱుంగనివారు కారు. నాయికానాయకుల పరస్పరప్రేమ సంభాషణములు తదభివ్యక్తికార్యములు తత్కాలప్రకృతిదృశ్యపరికరములు శాస్త్రిగారి మృదుహృదయమును ప్రేమేంగితజ్ఞానమును చాటుచున్నవి. మంజుదులయందలి వర్ణనములో "విక్రమోర్వశీయ" కళలు కొన్ని కాన్పించుచున్నవి. ప్రకృతియందలి వస్తువులలో నాయికావయవదర్శనముచే శాస్త్రిగారియాలంకారికదృష్టి సువ్యక్తమగుచున్నది. పట్టినదాని నెల్ల బంగారము కావించినారు కవి.

నిర్వహణసంధినిగూర్చి రెండుమాటలు. నాటికాంత ముదాత్తము. గురుపుత్రిని ప్రేమించిచేదోషము నాయకునిపై నున్నది. వితంతువై పాతివ్రత్యమును పరిపాలింపక వ్యతిరేకించిన లోపము నాయికయం దున్నది. వినతల్లియు, సోదరియు నాయికాదురదృష్టమునకు సానుభూతిచూపిన సరళహృదయలు. అప్పయ దీక్షితు లఖిలధర్మశాస్త్రవేత్త. తరుణవయస్కులకు పరస్పరానురాగము కలు

గుట ప్రకృతిసహజము. కాని, వారివివాహము సనాతనాచారమునకు విరుద్ధము. ఆచారము బలవత్తరము. భారతజాతికి సంప్రదాయము మిక్కిలి పవిత్రము. మరియొకకవి యయినచో నాయికానాయకుల మృతిని గాని, అందులో నొకరిమృతిని గాని కల్పించి, నాటికను దుఃఖాంతము చేసి యుండును. కాని శాస్త్రిగా రావిధముగా చేయక, దీక్షితులయాజ్ఞపై వారిని విడదీసి, ఆముష్మిక చింత కల్పించుట కొనియాడదగినది. ఆముష్మికసుఖమునకై ఐహికసుఖమును విడనాడుట భారతజాతీయ సంప్రదాయవిశిష్టత. దానిని చక్కగా పోషించినారు శాస్త్రిగారు.

“కృతానంగపతంగదాహః” అనియు, “యోగినాం విజయతే జ్ఞానప దీపో హరః” అనియు వ్యంగ్యముగా కామమునుదహించి యోగి నగుదు నను నాయకవాక్కులును; “మన స్తే పాదాబ్జే నివసతు”- సర్వము పరమేశ్వరార్పణము చేయుడు. నను నాయికవాక్కులును నాటికానిర్వహణమునకు మకుటాయమానములు!

దీక్షితపాత్రపోషణ మహోదాత్తము. ధర్మమునకును, మానవప్రకృతిని గలుగు సంఘర్షము సమంజసముగా నిర్వహింపబడినది. సర్వవిద్యాగానందరము చత్వారింశ త్పుత్రవిశసనమును వీక్షించిన దీక్షితులు వికలచిత్తుడై శ్రుతి రేవ ప్రమాణం అనుచు నెట్లు ధర్మమునకు తల యొగ్గెనో యట్లే పుత్రికాశిష్య ప్రేమను తరించి—

“పూర్వబంధములను పూర్వవాసనలను
కోసి, కడిగివేసికొనుటె శుభము”

అనువాక్కులతో ధర్మనిర్వహణ మొనరించినాడు. ఎంతటిధర్మపరత! ఎంతటి ఉదాత్తకార్యము! సంసారమోక్షములకును, ఐహికాముష్మికములకును ముడి పెట్టినారు శాస్త్రిగారు.

చంద్రమౌళితెరంగు చక్కగా దెలియు.
అన్యథా నిలిచిన దాతనిదృష్టి !

దీక్షితులు

అన్యదృష్టి యేమి ? ఆర్షేయ పౌరుషే
యములు కలుగువాడె : ఆత్మబంధు
గణము జేరి యతడు గార్హస్థధర్మము
నెరపుకొనుచు పొందు నిందుసుఖము.

సరస వాణి

పెండ్లిమాట లతండు పెడచెవి బెట్టి
తండ్రియానతిగూడ తల దాల్పకుండ
మనయూర నిన్నాళ్ళు మసలుచుండుటకు
కారణం బేదియో ? గ్రహియించినారె ?

[మందహాసము చేయును]

మమకార మతనికి మంగళమీద !
అనురాగమున పాణి అర్థించినాడు !

[దీక్షితు లాలోచనాయత్తు డగును -
మరకతవల్లి ప్రవేశించును.]

